35.

# మానవుని నిజ బంధువులు

**సత్యం మాతా పితాజ్ఞానం ధర్మోభ్రాతా దయాసఖా**
**శాంతం పత్నీ క్షమా పుత్రః షడేతే సర్వబాంధవాః**

ప్రేమస్వరూపులారా!

ప్రపంచములో ప్రతివ్యక్తికి ఒక్కొక్క తల్లి ఉంటుంది. కానీ జగత్తులో గల సర్వమానవులకు ఒకే తల్లి. ఆ తల్లిని మనం గుర్తించాలి. భౌతికమైన జగత్తునకు, లౌకికమైన జీవితమునకు, పారమార్థికమైన తత్వమును అర్థం చేసుకోవటం చాలా కష్టము. ప్రవృత్తి మార్గమున ప్రయాణము చేసే ప్రతి వ్యక్తికి కూడను దివ్యత్వము అర్థం కావటం చాలా అవసరం. ప్రతిమానవునకు ఒక మాతృదేవి ఉంటున్నది. ఆ దేవిని అనుసరించిన వారికి ఎట్టి యిబ్బందులు కలుగవు. ఆ తల్లి త్రికాల భాజ్యమైనది, త్రిలోకములకు అధిపతి అయినది. త్రిగుణములకు అతీతమైనది. ఇదియే **సత్యము.** ప్రాకృతమైన తల్లి మరణించవచ్చు, మార్పు చెందవచ్చు. ప్రదేశాన్ని మార్చవచ్చు. కానీ యీ తల్లి, సత్యం అనే తల్లి ఏ దేశమునకైనా, ఏ కాలమునకైనా, ఏ వ్యక్తికైనా, ఏనాటికైనా ఒక్కటే తల్లి. ఇట్టి దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన, సమంజసమైన, సారభూతమైన తల్లి సత్యం. ఈ సత్యమును ప్రతివ్యక్తి తల్లిగా భావించి విశ్వసించి అనుసరించటం అత్యవసరం. సత్యమునకు మార్పు లేదు. త్రికాలములందు ఏకస్వరూపము ధరించేది యీ సత్యం.

**ఇంక జ్ఞానమననేమి?**

పితా జ్ఞానం అన్నారు. తండ్రి ఎవరు? జ్ఞానం. జ్ఞానమనగా లౌకిక జ్ఞానము, భౌతిక జ్ఞానము, వైజ్ఞానిక జ్ఞానము అని అనేక రకములైన జ్ఞానములుంటున్నవి. కానీ యిది కాదు జ్ఞానము. అద్వైతదర్శనం జ్ఞానం. ఏకాత్మభావాన్ని విశ్వసించినదే జ్ఞానము. ఆ జ్ఞానమే సత్యస్వరూపము. దీనినే వేదము సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అనింది. కనుక సత్యమే ప్రతి మానవునికి మాతృ స్వరూపిణి. జ్ఞానమే తండ్రి.



srisathyasaivachanamrutam

**ధర్మమన నేమి?**

ధర్మో భ్రాత అన్నారు. బాహ్యముగా చూచినచో ధర్మము ఒక్కొక్క దేశమునకు, ఒక్కొక్క మతమునకు, ఒక్కొక్క సాంప్రదాయమునకు, ఒక్కొక్క ధర్మముగా కనిపిస్తుంది. కానీ సర్వమానవులూ, సర్వదేశములకు, సర్వకాలముల యందు ఏకత్వముతో ప్రేమించే సోదరుడు ఒక ధర్మము. ప్రేమస్వరూపుడైన వాడు యీ సోదరుడు. దీనిని పురస్కరించుకొనే ప్రాచీన కాలమునుండి భారతదేశము నందు వేదములో సత్యంవద, ధర్మంచర అని సత్యధర్మములకు అత్యంత ప్రాధాన్యమునందిస్తూ వచ్చింది. సోదరునకు మించిన తండ్రి మరొకరు లేడు. రామలక్ష్మణులు సోదరులై కూడను ఎలాంటి ఆదర్శమును జగత్తునకందించారు. ఒకానొక సమయంలో లక్ష్మణుడు మూర్ఛిల్లిన సమయంలో రాముడు చాలా బాధపడ్డాడు. లక్ష్మణా! సీతవంటి భార్యను ఎక్కడైనా వెదకి తీసుకోవచ్చు. కౌసల్య వంటి తల్లిని నేను వెదకి సాధించవచ్చును. కానీ లక్ష్మణుని వంటి సోదరుని తిరిగి పొందలేను. ఇలాంటి సోదరుడు ఉండటంచేత నా రామతత్వము ప్రకాశిస్తూ వచ్చింది. కనుక మనకు ధర్మమే సోదరుడు. దయాసఖా. ఈనాటి మిత్రులు రేపు శత్రువులుగా మారవచ్చు. ఈవిధముగా ఎన్నో అనుభవములు కనుపిస్తున్నవి జగత్తునందు. కాని దయకు మించిన మిత్రుడు మనకు కానరాడు. నిజమైన మిత్రుడు దయా స్వరూపుడు.

**శాంతమనగా నేమి?**

శాంతమే పత్ని. పత్ని ఎవరు? శాంతియే పత్ని. నిరంతరము అన్ని మార్గములందు అన్ని జీవరాసులందు అనేకత్వములోనున్న ఏకత్వమును గుర్తించినది యీ శాంతము. ఈ శాంతి మహర్షులకు ఆభరణము. ఋషుల యొక్క కిరీటము. ఆధ్యాత్మిక మార్గమందు రాజమార్గము. ఇలాంటి శాంతియే సర్వులకు పత్ని.

**క్షమయన నేమి?**

క్షమాపుత్రా. క్షమనే పుత్రుడు. క్షమకు మించిన మరొక సుపుత్రుడు లేడు. ఈ క్షమయే సత్యము. క్షమయే వేదము. క్షమకు మించిన శక్తి మరొకటి లేదు. సత్యము, జ్ఞానము, ధర్మము, దయ, శాంతి, క్షమ యీ ఆరు ప్రతి మానవునకు నిజ బంధువులు. ఈనాడు యిట్టి మాతృదేవుని, యిట్టి పితృదేవుని, ఇట్టి సఖుని, యిట్టి సోదరుని, యిట్టి

sri sathyasaivachanamrutam

పత్నిని, యిట్టి కుమారుని కోల్పోవటం చేత జగత్తు అనేక అల్లకల్లోములకు గురౌతున్నది.

**సత్యమే తల్లి**

ప్రేమస్వరూపులారా! తల్లిదండ్రులను మనం గుర్తించుకోవాలి. తల్లి తండ్రి లేక నీవు లేవు. సత్యమనే తల్లి నీకు, నాకు సర్వులకు తల్లియే.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునణగె సర్వ సృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్యమిదియె చూడరయ్య**

సత్యము నుండియే సర్వము సృష్టింపబడుతున్నాది. సర్వమునకు మాత అయిన యీ సత్యము నీకు మాత్రం మాతృమూర్తి కాదా. ఇది శాశ్వతమైన సత్యమూర్తి. అమృతమైన మాతృమూర్తి. ఇలాంటి అమరత్వమైన మాతృమూర్తిని పొందటం మానవుని మహాభాగ్యం.కానీ యీనాడు యిట్టి పవిత్రమైన సత్యమాతృమూర్తిని కోల్పోయినారు మానవులు. సర్వత్రా ఉండిన సత్యాన్ని యీనాడు కోల్పోయినాము. కనుక యీ మాతృమూర్తి అయిన సత్యమును ఆరాధించటమే యీనాటి ఆరాధన విశిష్టత. ఈ నవరాత్రులు దేవీ నవరాత్రులని, దేవి అనగా మాతృమూర్తియని మనం భావిస్తున్నాం. దేవి అనగా ఏమిటి? సత్యమే దేవి. ఆదేవి యొక్క పేరు సత్యస్వరూపిణి. ప్రతి మానవుడు సత్యాన్ని గుర్తిస్తూ వర్తించాలి. సత్యాన్ని విడనాడకూడదు. మాతృవియోగము మహా కష్టతరమైనది. కనుక సత్యాన్ని వీడక ఈ సత్యాన్ని మనం అనుసరించినప్పుడు సర్వవిధములైన సంబంధము మనకు సమకూరుతుంది. వేదము ఈ సత్యమునే బోధిస్తూ వచ్చింది. ఈ ప్రపంచములో వేదము నుచ్చరించిన వారున్నారు. సర్వశాస్త్రములు పఠించిన వారున్నారు. కానీ యివన్ని యీనాడు పెడమార్గము పట్టుతున్నవి. సక్రమమైన మార్గమును అనుసరించినప్పుడే ఈ వేదశాస్త్రములు సరైన ధర్మాన్ని నిరూపించగలవు.

**సత్యాన్వేషణ**

అనాదికాలము నుండి ఈ సత్యాన్వేషణ నిమిత్తమై అనేకమంది మహర్షులు

sri sathyasai vachanamrutam

మహనీయులు సాధనలు సల్పుతూ వచ్చారు. పవిత్రమైన కాలమును, విశిష్టమైన విశ్వాసమును, ధృఢ సంకల్పమును ఉంచుకొని ఈ సత్యాన్వేషణ నిమిత్తమై అనేకమంది దీక్షపూనారు. సత్యాన్ని దర్శించేవరకు నాదీక్ష విడువను అని అనేకమంది మహర్షులు తపస్సును ఆచరించారు. కొంతకాలమునకు వారే ప్రజలలో ప్రవేశించి "వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అన్నారు. ఓ ప్రజలారా మేము భగవంతుని ప్రత్యక్షంగా చూడగలిగాము. ఆ భగవంతుడు తేజోమయుడైనవాడు. దివ్యమైన ప్రకాశముతో ఉన్నవాడు. ఈ తమోగుణమునకు దూరముగా ఉండినవాడు. అజ్ఞానమనే తమో గుణమునకు ఆవలనున్న వాడు యీ తేజోవంతుడు. అటువంటి భగవంతుని మేము చూడగలిగాము. భగవంతుడు ఎక్కడో దూరముగా లేడు. ఎక్కడో మేము బయట వెతకలేదు. మృణ్మయమైన యీ దేహమందే ఈ చిన్మయమూర్తిని మేము చూడగలిగాము. ఈ మృణ్మయమైన దేహమందు చిన్మయమైన భగవంతుని దర్శించినవారు ఆనాటి మహర్షులు.

**దేహమొక రత్న పేటిక**

దేహము సామాన్యమైనదిగా మనం భావించరాదు. భగవంతుని నివాసము యీ దేహము. యిలాంటి పవిత్రమైన దేహమును యీనాడు అపవిత్రమైన మార్గమందు, కొన్ని విచిత్రమైన మార్గములందు ప్రవేశపెట్టి తాత్కాలికమైన సుఖములు అనుభవించగోరి అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన జీవితాన్ని గడుపుతున్నాడు. కాదుకాదు

**విలువలేని యినుపపెట్టె యీ దేహము**
**పెట్టెలోన నగలు పెట్టినట్లు**
**దేహమందు ఆత్మదేవుడుండెను సుమా!**

ఏవిధంగా విలువలేని యినుపపెట్టె యందు, విలువైన రత్నము దాచుకుందురో అదేవిధముగా ఈ విలువలేని దేహమందు విలువైన, ప్రకాశవంతమైన ఆత్మ అనే రత్నమును దాచుకున్నారు. అట్టి పవిత్రమైన, విలువైన రత్నమును దాచుకున్న దేహము సులభమైనదా? కాదు. ఈ ఆత్మరత్నము నిమిత్తమై దేహాన్ని మనం ఆశించి, ఆరాధించి

sri sathyasaivachanamrutam

దాన్ని సరైన మార్గములో వినియోగించుకోవాలి. ఈ రత్నములు మట్టిలోనే చిక్కును గానీ మానులో చిక్కవు. ఈ రత్నములు వెతుక వలెనన్న మట్టిలో వెతకాలిగానీ మానులో వెతికితే రావు. కనుక ఈ మృణ్మయమైన యీ దేహమందే యీ రత్నమును వెతకాలి.

**ఆత్మరత్నమెందుకు లభ్యంకాదు?**

అయితే ఈ రత్నము లభ్యము కాకుండా పోవుటకు కారణము ఏమిటని విచారించాలి. నాది అనే మమకారము, నేను అనే అహంకారము ఈరెండు అడ్డంగా నిల్చుకోవటం చేతనే దీనిని పొందలేకపోతున్నారు. 'నాది' అనేది మమకారం. 'నేను' అనేదే అహంకారం. ఈ మమకార అహంకారములు రెండు దూరం చేసినప్పుడే చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది. **మమకారము లేని మానవునకు చిత్తశుద్ధి లభిస్తుంది. అహంకారము లేని మానవునికి పరమ జ్ఞానము ప్రాప్తిస్తుంది.** కనుక చిత్తశుద్ధి, జ్ఞానసిద్ధి యీరెండు పొందుటకు అభిమాన మమకారములు అడ్డు తగులుతున్నాయి. ప్రతిమానవుడు ఈ అభిమాన మమకారములను సాధ్యమైనంత వరకు దూరం చేసుకోటానికి ప్రయత్నించాలి. ఏమిటి ఈ మమకారములో ఉండిన విశిష్టత. దీని విశిష్టత మనకు ఏమాత్రం అర్థం కావటం లేదు. మమకారం పెంచుకున్న కొలది మన జీవితము మరింత అశాంతికి గురౌతున్నది. ఈ మమకారమే మానవుని సర్వదుఃఖములకు మూలకారణము. ఈ మమకారము చేత ఆనందము దూరమవుతున్నది. శాంతిని కోల్పోతున్నారు. సౌఖ్యము శూన్యమౌతున్నది. కనుక మానవునికి యీ శాంతి, సుఖము లభించాలంటే మమకారం దూరం చేసుకోవాలి. అయితే ఈ మమకారము కొంత ప్రమాదము తెప్పిస్తుంది. అనేక విధములైన వ్యామోహము చేత యీ మమత్వము పెంచుకుంటున్నారు. ఈ మమత్వమే మోక్షమునకు అడ్డు తగులుతున్నది. ఇది చాలా విశాలమైన మార్గం. అహంకారం మరింత ప్రమాదమైనది. ప్రతి మానవునియందు ఈ అహంకారము తీరని రోగంగా ఉంటున్నాది. వేరే వేరే రోగములు కొన్ని మందులకు నయము కావచ్చుగానీ అహంకారము ఏ మందులకు నయం కాదు. ఈ రెండింటిని మనం కొంత వరకు అదుపులో ఉంచుకొని ఆత్మానంద నిమిత్తమై అన్వేషణ చేయాలి.

srisathyasaivachanamrutam

## త్రిమూర్తులెవరు?

ఈ నవరాత్రులందు దేవీ భాగవతము, రామాయణము, భారతము చదువుతూ వస్తుంటారు. దుర్గ, లక్ష్మి, సరస్వతి అని త్రిమూర్తులుగా ఆరాధన చేస్తుంటారు. ఈ త్రిమూర్తులు ఎవరు? ఈ త్రిమూర్తులు ఒక సత్యములోనే యిమిడినవారు. గాయత్రికి మూడు శిరస్సులుంటున్నాయి. ఆ మూడు శిరస్సులు యివియే. గాయత్రి, సావిత్రి, సరస్వతి. గాయత్రి – మన యింద్రియములకు అధిపతి గాయత్రి. సావిత్రి – ప్రాణములకు అధిదేవత సావిత్రి. సరస్వతి వాక్కునకు అధిదేవత సరస్వతి. కనుక వాగ్దేవతా స్వరూపిణి యీ సరస్వతి. ప్రాణములకు అధిపతి అయినదే సావిత్రి. మరి యింద్రియములకు అధిపతిగా ఉండినది గాయత్రి. యీ మూడు ఒక్క సత్యమునందే యిమిడి ఉంటున్నవి. ఓం భూర్భువస్సువః అను మంత్రములో ఈ భూర్భువస్సువః అంటే ఏమిటి?

## Matter Energy వేరు కాదు

భూర్ అనగా materialisation అయిన దేహము. భువః అనగా radiation సువః అనగా vibration. ఈదేహములో అంతా matter ఉంటున్నాది. మన వెంకట్రామన్ చెప్పాడు matter, energy గా మారుతుంది, energy, matter గా మారుతుంది. ఆయన సైంటిస్టు కాబట్టి ఆయన చెప్పింది సత్యమను కోవచ్చు. కానీ నా దృష్టిలో అది సత్యము కాదు. Matter, energy అని రెండు లేనేలేవు. అంతా ఒక్కటే. మేటరే ఎనర్జీ, ఎనర్జీయే మేటర్. Energy లేక matter లేదు, matter లేక energy లేదు. ఈ రెండు అవినాభావ సంబంధము అన్యోన్య ఆశ్రయము. కనుక రెండు అని చెప్పటం చాలా పొరపాటు. మేటరే యీ జగత్తులో లేదు. ఎక్కడ చూచినా శక్తియే ఉంటున్నాది. శక్తి తప్ప మరొక పదార్థమే కన్పించటం లేదు. కనుక యీ నవరాత్రి మహోత్సములందు శక్తి పూజలు చేస్తున్నాం. శక్తి ఎక్కడనుంచి వచ్చేది. సత్యమైనది శక్తి. ధర్మము ఒక శక్తి. శాంతి ఒక శక్తి. ఈ క్షమ ఒక శక్తి. ఇవన్నీ శక్తుల యొక్క ఆరాధనలే.

## సత్యమే తల్లి

అన్నింటికి సత్యమే మూలకారణము. సత్యమునకు మించినది మరొకటి లేదు.

sri sathyasai vachanamrutam

సర్వశక్తులు సత్యము నందంతర్భూతమై ఉన్నవి. కనుక ఆ సత్యమునే తల్లిగా మనం భావించాలి. మాతృదేవి. ఇలాంటి మాతృదేవిని మనం విస్మరిస్తే లభించేది ఏమిటి? తల్లి సమానమైన సత్యాన్ని మనం ఏనాడు మరువకూడదు. తల్లిని పూజించట మనగా సత్యాన్ని పూజించటము, సత్యాన్ని అనుసరించటమే. మనం సత్యాన్ని అనుసరించాలి. సత్యాన్ని పలకాలి. ధర్మము ఆచరించాలి. సత్యం వద – కానీ దురదృష్టవశాత్తు యీనాడు సత్యం వధ దాన్ని చంపేస్తున్నారు. ధర్మం చర. ధర్మమును అనుసరించమని చెబితే ధర్మాన్ని చరసాలలో పెడుతున్నారు యిప్పుడు. ఇంక రక్షించేది ఎవరు? సత్యధర్మములే సర్వరక్షకములు. అందరినీ రక్షించేది యీ రెండే. అలాంటి సత్యధర్మములను యీనాడు విస్మరిస్తున్నారు. అసత్యాన్ని, అధర్మాన్ని విశ్వసిస్తున్నారు. కనుక దేశమునకు ఏనాడు అనుభవించని అవస్థలు అనుభవించవలసి వస్తుంది. మన ప్రాచీనులు ఈ సత్యధర్మములను ఆధారంగా చేసుకొని రెండింటిని రెండు రెక్కలుగా తీసుకొని వారు జీవితాన్ని జీవిస్తూ వచ్చారు. ఏ చిన్నపని చేసినా ఆత్మసాక్షిగా చేసేవారు. ఇవి సత్యమా, అసత్యమా లేక ధర్మమా, అధర్మమా విచారించి ముందడుగు వేసేవారు. ఈనాడు ఆప్రశ్నయే లేదు. దైవాన్వేషణ జరుపుతున్నామంటున్నారు. ఈ దైవాన్వేషణ యీనాటిది కాదు. అనాదికాలము నుండి దైవాన్వేషణ జరుపుతూనే వున్నారు. నిన్న నేడు ప్రారంభమైనది కాదు.

**సత్యాన్వేషణ**

సత్యాన్వేషణ సరైన మార్గములో అనుసరించినప్పుడు సర్వము దైవ స్వరూపంగా రూపొందుతుంది. ఈ సత్యాన్ని అన్వేషణ ఎలా చేయాలి. సత్యమున్నది ఒక్కటే కదా! కాబట్టి ఎక్కడున్నదని మనం విచారించాలి. ఎక్కడున్నదని వెతకాలి? చిన్న ఉదాహరణము. తల్లిని చూచావు, sister ని చూచావు, బిడ్డను చూచావు, wife ని చూచావు. వీరందరిని స్త్రీలవలె నీవు చూస్తున్నావు. అయితే యీమె తల్లి యీమె sister, యీమె బిడ్డ, యీమె బంధువు అనుకుంటున్నావు. తల్లిని తల్లిగా చూడాలి. నీ యొక్క బిడ్డను బిడ్డగానే చూడాలి. నీయొక్క చెల్లెలును చెల్లెలుగానే చూడాలి. అక్కడ విచారణ చేయాలి. అన్వేషణ అంటే యిదే. తల్లిని ఏవిధంగా చూడాలి. మాతృమూర్తిగా మనం చూడాలి. పూజ్యనీయురాలిగా చూడాలి.

sri sathyasaivachanamrutam

గౌరవనీయురాలుగా చూడాలి. ఆమెను దేవతా స్వరూపిణిగా చూడాలి. ఇది యిందులో చూడవలసిన సత్యము. బిడ్డను బిడ్డగానే భావించాలి. ఆ బిడ్డ నాయొక్క అంశమే. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః." నా అంశమే నా బిడ్డ రూపములో వచ్చింది. బిడ్డను వాత్సల్యంతో చూడాలి. ఈవిధంగా ఎవరు తల్లి, ఎవరు బిడ్డ, ఎవరు చెల్లెలు ఈవిధముగా సత్యాన్వేషణ చేయటం అవసరం. ఈ నల్గురుని చూచేది ఒకే కన్నులే. ఒకే దృష్టి. అయితే తల్లిని ఏ దృష్టితో చూడాలి. Sister ను ఏ దృష్టితో చూడాలి. బిడ్డను ఏ దృష్టితో చూడాలి. భార్యను ఏ దృష్టితో చూడాలి. ఇదే సత్యాన్వేషణ.

**యద్దృశ్యం తన్నశ్యం**

కేవలం భౌతికమైన రూపనామములను మనం విచారించుకుంటే సత్యము మనకు తేలదు. మనకు తెలియనివి దృష్టికి గోచరము కానివి ఎన్నో ఉంటున్నాయి. 'యద్దృశ్యం తన్నశ్యం.' దృశ్యముగా కనుపించినది ఒకనాడు కనిపించకుండా పోతుంది. కానీ ఆధ్యాత్మిక మార్గమందు ప్రత్యక్ష ప్రమాణమని అనేకమంది వాదిస్తుంటారు. ప్రత్యక్ష ప్రమాణము పరిపూర్ణ సత్యము కాదు. నీకు పరిపూర్ణముగా కనిపించనివి ఎన్నో ఉన్నాయి ఆవ్యక్తి యందు. ప్రత్యక్షమునే ఆధారంగా తీసుకుంటే చాలా మోసమైపోతుంది. ప్రత్యక్ష ప్రమాణము పెడమార్గము పట్టిస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తి ఉంటున్నాడు. అతని height 4' 5''. అతని weight 45 pounds. రంగు తెలుపు. ఈవిధంగా పొడుగు, బరువు, రంగు చూచావు. అట్టి వ్యక్తిని ప్రత్యక్షంగా చూచాను అనుకుంటే అది సత్యమా? Weight ను చూచావు, height ను చూచావు, రంగు చూచావు యిదే ప్రత్యక్ష ప్రమాణమనుకుంటే మనకు తెలియనివి ఎన్నో ఉంటున్నాయి ఆవ్యక్తి యందు. కరుణ ఉండవచ్చు అతని యందు, ప్రేమ ఉండవచ్చు. దయ, నిర్దయ ఉండవచ్చు. క్రోధము ఉండవచ్చు. యివన్నీ మనకు తెలియనివి. తెలియనివి అన్నీ తనలో యిమిడి ఉన్నాయి. తెలిసినవే సత్యమని భావించుకోటం చాలా మూర్ఖత్వము.ప్రత్యక్ష ప్రమాణము అనేవారు పరమ మూర్ఖులు. ఆ ప్రత్యక్షమందు పరోక్షమనే గుణములు ఎన్నో ఉంటున్నాయి. ఈ గుణాన్ని మనం గుర్తించు కున్నప్పుడే ప్రత్యక్షం మనకు ప్రమాణంగా తోస్తుంది. కనుక ప్రత్యక్ష ప్రమాణమే ప్రధానమైనది కాదు. ప్రతి దానికి ఒక పరోక్షమైనది ఒకటి ఉంటున్నాది.

srisathyasaivachanamrutam

## దైవం సర్వత్రా ఉండేది

దైవం ప్రత్యక్షంగా కనిపించాలంటే ప్రత్యక్షంగా కనిపించేది కాదు. సర్వత్రా ఉంటున్నాది ఈ సత్యము. ధర్మము సర్వత్రా ఉంటున్నాది. నీవు ఆచరించి అనుభవించి ఆనందించు. అప్పుడు నీవు ఆత్మతృప్తిగా అనుభవించవచ్చు. అన్నింటికి conscience witness గా ఉంటున్నాది. ఈ conscience ను మనం విచారించకుండాపోతే సర్వము అసత్యంగానే మారిపోతుంది. అన్నింటికి ఆత్మసాక్షి. అదియే conscience. యిలాంటి ఆత్మసాక్షాత్కారానికి తగిన మార్గం వెదకాలి. ఈ ఆత్మ ఎక్కడ ఉంటున్నది. సర్వత్రా ఉంటున్నది. ఆత్మ లేని స్థానమే లేదు. ప్రతి వ్యక్తి యందు కూడా ఉంటున్నది. ప్రతి జీవియందు ఉంటున్నాది. ప్రతి ప్రాణియందు ఉంటున్నాది. కానీ మనకు కనిపించేది సరైన రూపం కాదు. దానికి రూపం లేదు. నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్తి నిర్మల స్వరూపిణం. అలాంటి ఆత్మతత్వాన్ని ఎవరు గుర్తించగలరు? అసలు సత్యం అంటున్నావు సత్యాన్ని నీవు గుర్తిస్తున్నావా? ప్రత్యక్ష ప్రమాణమైన సత్యాన్నే నీవు గుర్తించుకోలేకపోతున్నావు. నిత్యజీవితములోని సత్యజీవితాన్ని గుర్తించు కోలేకపోతున్నావు. సత్యమంటే చెప్పింది చెప్పటం, చూచింది చెప్పటం, వినింది చెప్పటం. ఇది మాత్రం సత్యమనుకుంటున్నాం. ఇది అంతా ఇంద్రియములకు గోచరమైనదే. ఇంద్రియాతీతమైనది ఆత్మతత్వము. ఇలాంటి ఆత్మతత్వము మనం ఏరీతిగా గుర్తించాలి. మన conscience మనం విచారం చేయాలి. నీవు ఎక్కడో పోయి వెతుకనక్కర లేదు నీయందున్న conscience నీవు వెతుకు. నీ దృష్టి బహిర్‌దృష్టి కాకుండా అంతర్‌దృష్టిగా మార్చుకో. చూసేదంతా దైవ స్వరూపమే. అందువల్లనే వేదము "పశ్యన్నపిచ న పశ్యతి మూఢో" అని చెప్పింది. నీవు చూచేదంతా దైవమే. కానీ దైవాన్ని చూస్తూ దైవమని భావించుకోకుండా ప్రకృతిగా నీవు విశ్వసిస్తున్నావు. కానీ ఆత్మ దృష్టిగలవాడు ప్రకృతినంతా దైవము గానే భావిస్తాడు. దీన్ని చూచినవాడు దాన్ని చూడలేడు. లోకభావముతో చూచేవానికి లోకమే కనిపిస్తుంది గానీ లోకేశుడు కనిపించడు. సర్వం విష్ణుమయం జగత్ అనింది. సర్వత్రా ఉన్నది భగవత్తత్వమే. మానవాకారమని నీవు భావిస్తున్నావు. ఆకారములు వేరువేరుగా ఉండవచ్చును. ఆకారమునకు తగిన నామములు వేరువేరుగా ఉండవచ్చును. కానీ అందరి

srisathyasaivahini

యందున్న ఆత్మ ఒక్కటే. అట్టి ఏకత్వాన్ని గుర్తించటానికి తగిన కృషిచేయాలి. మన బహిర్‌దృష్టిని అంతర్ముఖంగా మార్చుకోవాలి. అప్పుడే మనకు సత్యమైన స్వరూపము గోచరిస్తుంది. కనుక సత్య స్వరూపాన్ని గుర్తించటానికి సత్యాన్వేషణ జరపటానికి మార్గము వేరొకటి లేదు. తన తత్వాన్ని తాను గుర్తించాలి. ఏవిధమైన కలతలు లేకుండా నిర్మలమైన చిత్తముతో, నిస్వార్థమైన భావముతో ఈ అన్వేషణ సల్పాలి.

**ఆత్మ(ప్రేమ)తత్వము**

ఈ హృదయమునందు ప్రేమతత్వము తప్ప మరొకటి లేదు. ఈ ప్రేమయే సత్యము. సత్యమే ప్రేమ. ధర్మమే ప్రేమ, ప్రేమయే ధర్మము. కాబట్టి సర్వము ప్రేమమయంగా ఉండేది. కానీ ఈ ప్రేమయే సత్యస్వరూపంగా మారుతున్నాది. ఈవిధంగా ఎట్లా మారుతున్నాది. ఒక చిన్న ఉదాహరణము. చిన్న బిడ్డ పుట్టింది. నీవు child అని పిలుస్తున్నావు. 10 years అయిన తర్వాత boy అని పిలుస్తారు. ఆ boy 30 years గా మారతాడు. అప్పుడు అతన్ని man అని పిలుస్తావు. ఆ man 75 years గా మారినప్పుడు grandfather అని పిలుస్తావు. ఈ child, boy, man, grandfather ఒక్కడే కదా! అదే రీతిగా దేహమందుండినప్పుడు ఆత్మ అని పిలుస్తున్నావు. ధ్యానములో శక్తి అని పిలుస్తున్నావు. నీవు అనుభూతిలోకి వచ్చినప్పుడు దైవమా అని పిలుస్తున్నావు. ప్రతి మానవునికి ఆకలిపిచ్చి ఎంతనో దైవం పిచ్చి కూడా అంతనే. ఆకలిపిచ్చి అనుకోండి, అజ్ఞానమనుకోండి, యింకే విధమైనది అయినా అనుకోండి. నీపిచ్చి నీది, నా పిచ్చి నాది. నీ పిచ్చి నీకే ఉంటుంది. నాపిచ్చి నాకే ఉంటుంది. దీన్ని పిచ్చి అని ఏరీతిగా చెప్పగలవు? యిది మూర్ఖమత్వమని ఏరీతిగా చెప్పగలవు? నా విశ్వాసము నాది నీ విశ్వాసము నీది. నీ మూర్ఖత్వం నీది, నామూర్ఖత్వం నాది. నా ప్రత్యక్షం నాది, నీ ప్రత్యక్షం నీది. నీ experience నీది. నా experience నాది. ఎవరి experience వారికి వదలిపెట్టాలి. యింకొకరిని వేలు చూపించి తప్పుగా చెప్పటానికి ఏమాత్రం అధికారం లేదు. నీ conscience నిన్ను గైడ్ చేస్తున్నాది. కనుక మన ఆత్మనే మనకు సరైన సాక్షి. పుట్టినది దేహము. మరణించునది దేహమే. ఆత్మకు పుట్టుక చావు రెండూ లేవు.

srisathyasaivachanamrutam

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంత రహితుడనాది వాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**ఆత్మరూపుడై అంతట వెలసియుండు**

**బ్రహ్మమనగా నేమి?**

బ్రహ్మ అనగా ఏమిటి? నాలుగు శిరస్సులున్న వాడు కాదు బ్రహ్మ. బ్రహ్మ అనగా అంతటా వ్యాపించిన వాడు బ్రహ్మ. ఎక్కడ చూచినా బ్రహ్మాయే. ఈ expansion love is God. నా దేహమనే contraction love is death. నా దేహము అనేది ఒక్క దేహానికి సంబంధించినదే. Expansion love ని పెంచాలి. అదే love is God, live in love. సంకుచితంగా మనం చింతించుకోకూడదు. నా పిల్లలు, నా బంధువులు ఈవిధంగా మనం వేరుగ పోకూడదు. ఒక్క చిన్న ఉదాహరణము. గణితశాస్త్రములో 1+1+1+1 అని పెడితే 4 అయింది. నెంబరు వేస్తుంటే పెరిగిపోతూనే ఉంటుంది. కానీ ఆత్మ + ఆత్మ + ఆత్మ... ఆత్మనే అయిపోతుంది. ఆత్మ ఒక్కటే అయిపోతుంది. ఇది ఆధ్యాత్మిక గణితము. 1+1+1...అనేది లౌకిక గణితశాస్త్రము. ఇది పెరుగుతుంది, తరుగుతుంది. ఎనిమిదిలో ఒకటి తీస్తే ఏడు అవుతుంది. ఎనిమిదికి ఒకటి కలుపుతే తొమ్మిది అవుతుంది. తగ్గుతుంది, పెరుగుతుంది. I + I = I అనేదే ఆత్మ స్వరూపము. ఈ ఆత్మకు మొట్టమొదటి పేరు I అదే అహం బ్రహ్మాస్మి. అహం అనగా నేనే. ఈనేను అనేది ఒక దైవము యొక్క పేరు. ఇలాంటి అహంను ఏరీతిగా గుర్తించాలి. సత్యజీవితాన్ని మనం అనుసరించాలి. లోకములో ఉండినది అంతా సత్యమే. అసత్యమనేదే మనకు లేదు. నీదృష్టిలో అది అలా కనిపిస్తున్నది గానీ యింకొక దృష్టితో చూస్తే అది అసత్యమే కాదు. ప్రపంచమంతా దృష్టి దోషమే గానీ సృష్టి దోషము లేదు. నీలంరంగు అద్దాలు ధరిస్తే అంతా నీలంగా కనిపిస్తుంది. Red glasses పెట్టుకుంటే red గా కనిపిస్తుంది. నీ గ్లాసెస్ దోషమే గానీ eyes దోషము కాదు. అందరి దృష్టీ ఒక్కటే. సృష్టి ఒక్కటే. ఈసృష్టి దైవస్వరూపమే. సర్వంఖల్విదం బ్రహ్మ. అంతా బ్రహ్మ స్వరూపమే. అందరిని బ్రహ్మగా భావించాలి. అందరిని బ్రహ్మగా గౌరవిస్తాం. అందరిని

sri sathyasai vachanamrutam

బ్రహ్మగా ప్రేమిస్తాము. ఈవిధంగా ఉన్నప్పుడు ద్వేషానికి, ఈ కక్షలకు, కల్లోలములకు ఏమాత్రం అవకాశము ఉండదు. ఈనాడు లోకములో యింత కల్లోలములకు కలతలకు కారణం ఏమిటి? సమత్వం లేకపోవటమే మూలకారణము. ఈ సమత్వం వచ్చినప్పుడే అందరియందు ప్రేమతత్వం ఆవిర్భవిస్తుంది.

**సప్తాహమనగానేమి?**

ప్రేమస్వరూపులారా! ఈనాడు నవరాత్ర మహోత్సవం లోపల ఈ సప్తదినములు సప్తరకములైన పూజలు చేస్తున్నారు. సప్త విధములుగా ఆరాధన సల్పుతున్నారు. దీనికి సప్తాహమని పేరు పెట్టుకున్నారు. సప్తాహమనటానికి కారణం ఏమిటి? ఎందుకు సప్తాహం అని పెట్టుకోవాలి. అంకెల దానిలో కూడా సప్తస్వరములు, సప్తలోకములు, సప్తసముద్రములు అన్నీ సప్తముగా ఉంటున్నాయి. సంగీతములో సప్తస్వరములుంటున్నాయి. సరిగమ పదని. ఇవన్నీ మనయందే ఉంటున్నాయి. నీ కంటే భిన్నమైనది ఏదీ లేదు. దైవము నీ కంటే వేరుగా ఉన్నాడనుకోవడం అజ్ఞానము. నీవు భగవంతుని ఎక్కడో వెదకటం పెద్ద అజ్ఞానము. నీవే దైవ స్వరూపము. నీవు కేవలం ఒక మానవునివలె విశ్వసించి ఈ మానవాకరమునే కొంత ఆధారము చేసుకొని నేను ఫలానవాడను అని విశ్వసిస్తున్నావు.

**హృదయమనగా నేమి?**

దేహము సరైనది కాదు. Body is like a water bubble. Mind is like a mad monkey. ఈ పిచ్చికోతిని, యీ water bubble ని ఎందుకు నమ్ముకుంటావు. Water bubble ఎప్పుడు burst అయిపోతుందో. ఈ monkey ఎప్పుడు పడుతుందో. దాని పేరే monkey. ఆ monkey ని mankind గా మార్చుకోవాలి. నీ conscience ను నీవు follow చేయి. అప్పుడే నీవు ఆత్మ తృప్తి పొందుతావు. ఆత్మహృదయము, హృదయవాసి భగవంతుడు. సర్వము హృదయము నుండే ఆవిర్భవిస్తున్నాయి. హృదయమనగా దైవస్థానమే. దైవ స్థానము నుండి అన్నీ మంచివే రావాలి. చెడ్డగానీ, దుర్మార్గమైనవిగానీ, అపవిత్ర మైనవిగానీ, అధర్మమైనవి గానీ హృదయము నుంచి రాకూడదు. ఈకోపము,

sri sathyasai vacharamrutam

అసూయ, కపటము హృదయమునుండి వస్తున్నాయంటే నీవు మృగస్వరూపుడే గానీ మానవస్వరూపుడు కాదు. నీ హృదయములో animals ఉన్నాయి గానీ దైవము లేడు. నీవు ప్రేమతో, సహనముతో, శాంతితో, దయతో నీవు ప్రవర్తిస్తే అప్పుడు నీ యందు దైవము ఉంటాడు. నీవు మానవత్వము ప్రకటించాలంటే పవిత్రమైన గుణములు ప్రకటించాలి. ఇలాంటి పవిత్రమైన గుణములు పెంచే నిమిత్తమై ఈ నవరాత్రి ఆరాధనలు ప్రారంభమైనాయి. దుర్గా, సరస్వతి, లక్ష్మి అని. ఇవన్నీ మూడు గుణముల స్వరూపమే. సత్వ రజో తమో గుణములు. యీ మూడు గుణములు మూడు ఆకారములుగా తీసుకోవాలి. స్వాతికము హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. రజోగుణము కంఠమునుండి వస్తుంది. తమోగుణము నాలుకనుండి వస్తుంది. నాలుక నుంచి వచ్చేదంతా గ్యాస్ గ్యాస్. నీ హృదయమునుండి రావడం లేదు. కంఠమునుండి వచ్చేది రజోగుణము. హృదయమునుండి వచ్చేదే శాంతమైనది ప్రేమమయమైనది, సత్యమైనది. శాంతంగా రావాలి. ఆ శాంతము హృదయానికి స్థానం. మనము మానవుల మనకున్నప్పుడు శాంతి వచనాలతో ప్రారంభము కావాలి. ఆ శాంతమే సత్వగుణము.

**అయోధ్య అనగా హృదయమే**

మీకందరికి తెలుసు దశరథుడు. ఎవరు దశరథుడు. అయోధ్యా రాజా దశరథుడు, కాదుకాదు. 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు పది. ఈ పది యింద్రియముల రథమే దేహము. దశరథుడు. ఈ దశేంద్రియములకు అధిపతియే దశరథుడు. ఈ దేహమే ఒక రథము. ఈ రథమునకు దశరథుడు అధిపతి. ఇతను మూడింటిని ఆశించాడు. అవే కౌసల్య, సుమిత్ర, కైకేయి. ముగ్గురు పత్నులు. యివియే సత్వగుణము, రజోగుణము, తమోగుణము ఈ మూడు గుణములు ద్వారా చతుర్విధ పురుషార్థములు పుట్టాయి. ధర్మ అర్థ కామ మోక్షములనే రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు. ఈ దశరథుని ముఖ్య పట్టణము ఏది? అదే అయోధ్య. అయోధ్య అనగా యోధులు చేరరాని స్థలము. యిదే హృదయము. హృదయంలో ఎవ్వరూ చేరటానికి వీలులేదు. ఏ ద్వేషి లోపలకు ప్రవేశించటానికి వీలులేదు ఏ దుర్మార్గుడు కూడా ప్రవేశించటానికి వీలులేదు. ఎవ్వరు చేరలేని స్థానము ఈ అయోధ్య. అదియే నిజమైన ముఖ్యపట్టణము. మన జీవితానికి అదియే ముఖ్యపట్టణము. అంగములోని



sri sathyasai vahini amrutam

సంగము, సంగములోని లింగము, లింగములోని జంగము. అంగము. అంగములోని సంగము ఏమిటి? అవే కామ క్రోధ లోభ మద మత్సరములు. ఈ సంగములోపల ఒక జంగము ఉంటున్నాడు. అతనే ఆత్మ స్వరూపుడు. ఆ జంగమే లింగము. అతను అన్నింటిని సమాప్తి చేయిస్తాడు. కాబట్టి సర్వము మనయందే ఉంటున్నాది. విశ్వమంతా మనయందే ఉంటున్నాది. నీవు విశ్వాన్ని చూడాలని ప్రయాణం చేస్తున్నావు కానీ చాలా పిచ్చితనము. ఏ ప్రదేశమునకు పోయినా బిల్డింగులు మారవచ్చును, మనుష్యులు మారవచ్చును, పరిస్థితులు మారవచ్చు కానీ నీయందున్నది ఏనాటికి మారదు. ఏమిటి నీవు ప్రపంచములో చూచేది? ఏమిటి బయట ఉన్నది? బయటపోతే బయట దృశ్యాలన్నీ గొప్పగా కనిపిస్తాయి. దూరంగా ఉన్నప్పుడు అంతా నున్నగా కనిపిస్తాయి. దూరపు కొండలు నునుపు అన్నారు. దగ్గరపోతే గుండు బండలే. నునుపుతనము ఎక్కడా లేదు. దూరంగా ఉండటంచేత అన్నీ ఆవిధంగా భావిస్తున్నారు. దగ్గరకు వచ్చినప్పుడే యదార్థం గుర్తించుటకు వీలవుతుంది. నీవు దూరంగా ఉన్నదనే భావం చేత పిచ్చివాడౌతున్నావు.

**స్వర్గం, నరకాలు నీ లోనే ఉన్నాయి**

వైకుంఠము ఎక్కడో దూరము లేదు, కైలాసము ఎక్కడో దూరము లేదు, స్వర్గమెక్కడో దూరము లేదు ఈ మూడు నీ హృదయమందే ఉంటున్నాయి.

**తన సంతోషమె స్వర్గము తన దుఃఖమె నరకమంద్రు**

తన దుఃఖమె నరకమంటున్నావు, తన సంతోషమే స్వర్గమంటున్నావు. స్వర్గము వేరు నరకము వేరు లేదు. అనగా దోషములు రాకుండా ఉండుటకై నరకప్రాప్తి వస్తుందని చెబుతున్నారు. నరకము లేనే లేదు. రెండు కూడాను మనస్సు నందే ఉన్నాయి. మనోప్రవర్తనలే ఈ సుఖ దుఃఖములకు కారణం. నీకు దుఃఖము ఎక్కడ నుంచి వస్తుంది, అది నీ ప్రవర్తనల రియాక్షనే. ఆ రీసౌండే, ఆ రిఫ్లక్షనే. Resound, reflection, reaction ఈ మూడింటి ప్రతిబింబాలే మన హృదయంలో ఉంటున్నాయి. బుద్ధుడు అనేక రకములుగా సాధన చేశాడు. అనేక సం॥లు దీక్షపూనాడు. కట్టకడపటికి ఒకనాడు కండ్లు తెరచి చూచాడు. ఓహో నేను యీనాడు దొంగను పట్టేశాను అన్నాడు. ఎవరు దొంగ! ఈ

srisathyasaivahinimutam

మనస్సేదొంగ. ఈ దేహాన్ని యిన్ని అవస్థలకు గురిచేసింది. కాబట్టి మనస్సును పట్టేశాను యింక నాకే బాధలు లేవు అన్నాడు.

**తనను తాను తెలిసికొనుటే ఆనందము**

మనస్సు control చేసుకుంటే యింకే బాధలు ఉండవు. ఈనాటి మానవుడు తన మనస్సును తాను కంట్రోలు చేసుకోటం లేదు. ఎక్కడ చూచినా అనేకమందిని కంట్రోల్ చేస్తున్నాడు. Man has conquered every thing, but he has not conquered himself. ఎవరు చెప్పారు. అతడే చర్చిల్. తనను తాను తెలుసుకోకుండా ఎన్నింటినీ తెలుసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. ఏమిటి మానవుడు చేసే పరిశోధనలు. ఈ పరిశోధనల వల్ల తనకు తెలిసేది ఏమిటి! ఏమీ తేలదు. యివన్నీ కేవలము బయటి దృష్టితో చేస్తున్నారు. తనను తాను గుర్తించుకున్న సర్వము గుర్తించుకున్నవాడౌతావు. ఇదియే ఉపనిషత్తులంతా చెప్పాయి. ఏ దాన్ని తెలుసుకుంటే సర్వము తెలుసుకున్న వాడౌతాడో, ఏదాన్ని చూస్తే సర్వము చూచిన వాడౌతాడో, ఏదాన్ని అనుభవిస్తే సర్వము అనుభవించిన వాడౌతాడో దానినే నీవు అనుభవించు. అదియే ఆత్మానందం. అదియే నిత్యానందం. అదియే పరమానందం. అదే అద్వైతానందం. అదే సాక్షాత్ ఆనందం. ఆ ఆనందం ఎక్కడ ఉంది. Happiness is union with God. అది నిజమైన ఆనందము. ప్రాపంచిక వ్యవహారాల వల్ల చాలా అశాంతియే. ఈ ఆనందము ప్రపంచములో కూర్చినప్పుడు చాలా అశాంతిగా రూపొందుతుంది. ఈ ఆనందము దైవములో మనం చేర్చాలి. దైవమంటే బయట ప్రదేశములో వెతుకుతూ పోనక్కరలేదు. నీ అంతర్ముఖమైన భావాలు అభివృద్ధిపరచుకో అప్పుడే నీకు ఆత్మానందం ప్రాప్తిస్తుంది.

**క్షీర, క్షార సాగరాలు**

నీ హృదయము క్షీరసాగరము. క్షీరసాగరమైన నీ హృదయాన్ని క్షారసాగరంగా మార్చుకుంటున్నావు. క్షీర సాగరమునందే విష్ణువు పవళించినది. కాబట్టి హృదయమునందే విష్ణువు పవళించి ఉన్నాడు. క్షార సాగరంగా మారిపోతే తిమింగళాలు పవళిస్తాయి. క్షారసాగరంగా పోకూడదు. క్షీరసాగరంగా మార్చుకోవాలి. అంతటి

srisathyasaivachanamrutam

నిర్మలమైనది మానవ హృదయము. అంతటి నిస్వార్థమైనది మానవ హృదయము. అంత పవిత్రమైనది మానవ హృదయము. క్షీరము రంగు తెలుపు. నిర్మల హృదయంగా ఉండాలి. అప్పుడే ఆ నిర్మల హృదయంలో విష్ణువు పవళిస్తాడు. విష్ణువు సర్వవ్యాపకుడు. హృదయవాసిగా ఉంటాడు. విష్ణుస్థానము హృదయమే. ఈవిధంగా మనం దైవత్వాన్ని గుర్తించుకుంటే బయట ఎక్కడో మనం పోనక్కర లేదు. God is with you, in you, around you. ఇలాంటి దగ్గరనున్న దైవత్వాన్ని విస్మరించి దూరంగా దూరంగా ఎక్కడో ప్రయాణమై పోతున్నాం మనం. దైవం కంటె దగ్గరైన వాడు ఎవడు లేడు. ఈ దైవమే తల్లి.

**తల్లి కంటె మిగుల దైవంబె దగ్గర**
**తండ్రి కంటె చాలా సన్నిహితుడు**

సత్యమనే తల్లి హృదయస్థానంలో ఉంటున్నది. సత్యస్వరూపిణి, అదియే వాక్ స్వరూపిణి. సత్యమును ఆరాధించండి. సత్యాన్ని అనుసరించండి. సత్యవాక్కు ఉచ్ఛరించండి. సత్యమార్గములో ప్రయాణంకండి. సత్యధర్మాల్ని రెండింటిని ఏకం చేయండి. ఈ రెండింటితో మానవత్వం సార్థకమవుతుంది. నేను మొట్టమొదట ప్రారంభించినప్పుడు శ్లోకముతో ప్రారంభమవుతుంది. ఉపన్యాసము భజనతో అంత్యమవుతుంది. ఈ రెండు ఎలాంటివి తెలుసునా? మొట్టమొదటి శ్లోకము క్రింద ప్లేటు. నాయొక్క సంభాషణ అంతా అందులో వడ్డించిన విందు పదార్థాలు. కడపటి భజన కప్పిన ప్లేటు. కానీ పెట్టిన విందును, విందుగా తీసుకోండి. మందుగా తీసుకోకూడదు. ఈ విందును పూర్ణంగా అనుభవించాలి. అప్పుడే "పూర్ణమిదః పూర్ణమదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే." విద్యార్థులారా! ప్రేమస్వరూపులారా! మీరు తెలుసుకోవలసినవి నిత్యజీవితంలో ఎన్నో ఉంటున్నాయి. దైవత్వము వరకు పోనక్కరలేదు. మానవత్వములోని దోషములే మొట్టమొదట గుర్తించండి. ఏ మార్గములో నడచిన, మానవుడు పరిపూర్ణ మానవుడుగా ఉంటాడో ఆలోచించండి. ఈ పరిపూర్ణ మానవుడు కావటానికి ఏది ప్రధానమైన అవకాశము, అదియే ప్రేమతత్వము. ఆ ప్రేమతత్వాన్ని చక్కగా మార్చుకుంటే సర్వము ప్రేమమయంగా ఉంటుంది.

**(తేదీ 25-09-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam